క్లుప్తంగా

5లోగా పెన్షనర్లు ఈకేవైసీ చేసుకోవాలి

మంగళగిరి: నగరంలోని ఉప ఖజానా కార్యాలయం ద్వారా పింఛను పొందుతున్న కుటుంబం, సేవా పింఛనుదారులు మే 5వ తేదీ లోగా పెన్షనర్ సీఎఫ్ఎంఎస్ ఐడీ నంబరుతో ఆధార్‌తో ఈకేవైసీ చేసుకోవాలని ఉప ఖజానా అధికారి ఎ.శ్యామ్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొంత మంది ఈకేవైసీ చేసుకోలేదని పేర్కొన్నారు. పెన్షనర్లు తప్పనిసరిగా లింక్ చేసుకోవాలని కోరారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 30 మందిపై కేసు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి మండల, రూరల్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి ద్విచక్ర వాహనాలు నడుపుతున్న 30 మందిపై సోమవారం కేసులు నమోదు చేశారు. తాడేపల్లి సీఐ శేషగిరిరావు తెలిపిన వివరాలు.. తాడేపల్లి మండల, పట్టణ పరిధిలో పలు ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి అతివేగంతో ద్విచక్ర వాహనాలు నడుపుతున్న 30 మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. వారందరినీ కోర్టుకు హాజరిచినట్లు వివరించారు.

తుని ఘటనలో నిజమైన దోషులను పట్టుకోవాలి

మంగళగిరి: తుని రైలు దహనం కేసులో నిజమైన దోషులను పట్టుకోవాలని కాపు నేత మంచాల సుధాకర్ నాయుడు కోరారు. సోమవారం నగరంలోని కార్యాలయంలో ఆయన మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేసిందన్నారు. రైల్వే కోర్టు తీర్పులో నిర్దోషులుగా ప్రకటించడం సంతోషకరమన్నారు. సమావేశంలో కాపు సంఘం నాయకులు తాటి కృష్ణారావు, తిరుపతి నాయుడు పాల్గొన్నారు.

తోపుడు బండ్లు అందజేత

మంగళగిరి: నగరంలోని పాత మంగళగిరికి చెందిన పలువురు చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) తోపుడు బండ్లు సోమవారం అందజేశారు. లూథరన్ చర్చి వద్ద తోపుడు బండ్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, ఎండీ ఫిరోజ్ పాల్గొన్నారు.

ఐదు ట్రాక్టర్లు, రెండు పొక్లెయిన్లు స్వాధీనం

మంగళగిరి: మండల పరిధిలోని కృష్ణాయపాలెంలో నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు, పొక్లెయిన్లను రూరల్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ రమేష్ బాబు తెలిపిన వివరాలు.. కృష్ణాయపాలెంలో రాత్రి వేళల్లో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారనే సమాచారం మేరకు దివారం రాత్రి దాడులు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ దాడుల్లో ఎటువంటి బిల్లులు లేకుండా మట్టి తరలిస్తున్న 5 ట్రాక్టర్లను, మట్టిని తీస్తున్న 2 పొక్లెయిన్లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించి ఏడుగురు డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

ముగిసిన బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు

ఫిరంగిపురం: మండలం కేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. మండపంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, మండపారాధన, ఏకహారతి పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ల్యాప్‌టాప్ దొంగ అరెస్ట్

తాడేపల్లిరూరల్: ప్రైవేటు హాస్టళ్లలో ల్యాప్‌టాప్‌ల దొంగతనం కేసులో బాలుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. సీఐ శేషగిరిరావు తెలిపిన వివరాలు.. వడ్డేశ్వరంలో 10వ తరగతి వరకు చదివిన బాలుడు ప్రైవేటు హాస్టల్‌లో పని చేస్తున్నాడు. హాస్టల్‌లో ఉన్న విద్యార్థులతో స్నేహం చేస్తూ వారు నిద్రపోయే సమయంలో వారి వద్ద ఉన్న ల్యాప్‌టాప్‌లు చోరీ చేస్తున్నాడు. ద్వారకా తిరుమలకు చెందిన హర్ష స్థానిక యూనివర్సిటీలో చదువుతున్నాడు. గత నెల 29వ తేదీ అతడి ల్యాప్‌టాప్‌తో పాటు అతని స్నేహితుడి ల్యాప్‌టాప్‌కు చోరీకి గురయ్యాయి. 30వ తేదీన తిరుపతికి చెందిన సరిగొప్పుల చంద్రశేఖర్ ల్యాప్‌టాప్‌తో పాటు అతని స్నేహితుడి ల్యాప్‌టాప్ కూడా చోరీకి గురయ్యింది. వీరు ఇద్దరూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా వడ్డేశ్వరం వద్ద నాలుగు ల్యాప్‌టాప్‌లు తీసుకుని బాలుడు వస్తుండగా ఆ బాలుడిని ప్రశ్నించామని, పొంతన లేని సమాధానాలు చెబుతుండడంతో తమదైన శైలిలో దర్యాప్తు చేయగా ల్యాప్‌టాప్‌లు చోరీ చేసినట్లు సదరు బాలుడు ఒప్పుకున్నాడని, ఆ బాలుడ్ని అరెస్ట్ చేసి కోర్టు హాజరు పరిచినట్లు సీఐ శేషగిరిరావు తెలిపారు.

ఘనంగా ప్రపంచ కార్మిక దినోత్సవం

మంగళగిరి: ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని సోమవారం కార్మికులు ఘనంగా నిర్వహించారు. వాడవాడలా ఎర్రజెండా ఎగురవేశారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. సీపీఎం, సీపీఐ, ఏఐఎఫ్‌టీయూ, మండల న్యాయ సేవాధికార సంఘం, ఎస్సీ ఎస్టీ రైట్స్,యాక్ట్స్, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యం మే డే నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, జేవీ రాఘవులు, పిల్లలమర్రి బాలకృష్ణ, వి జవహర్ లాల్, జంగాల అజయ్‌కుమార్, కంచర్ల కాశయ్య, చిన్ని తిరుపతయ్య కాసిన కొండలరావు, దానబోయిన భాస్కరరావు, ఎస్.లక్ష్మయ్య, ఎస్‌కే ఇబ్రహీం, బయ్యాల నరసయ్య, మల్లవరపు రామ్మూర్తి, శ్రీనివాసరావు, కారుమంచి రామారావు, గరికముక్కు డేవిడ్, గంజి వెంకయ్య, బూసి గోవిందరాజు, కుర్రా శ్రీనివాసరావు, శంకర్ పాల్గొన్నారు.

ఘనంగా మేడే వేడుకలు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలోను, దుగ్గిరాల మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో మే డే వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని సీపీఐ కార్యాలయంపై ఏఐటీయూసీ జెండాను సీపీఐ సీనియర్ నాయకులు మానికొండ డాంగే ఆవిష్కరించారు. పార్టీ కార్యాలయం ఎదుట మునగాల రామారావు జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మంగళగిరి నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య, సీనియర్ నాయకులు గుంటక సాంబిరెడ్డి, తాడేపల్లి ప్రాంత సహాయ కార్యదర్శి మునునూరు సుహాస్, తుడిమెల్ల వెంకటయ్య, దొంత కోటేశ్వరరావు, కళ్ళం శ్రీనివాస్‌రెడ్డి, శీలం అనిల్, పాల్గొన్నారు.

నులకపేటలో....

ఎంటీఎంసీ పరిధిలోని నులకపేటలో ఆటో యూనియన్ కార్యాలయం వద్ద నులకపేట ఆటో యూనియన్ అధ్యక్షులు షేక్ శ్రీను జెండాను ఆవిష్కరించారు. అనంతరం ర్యాలీగా మంగళగిరి బస్టాండ్, ఆటో స్టాండ్ వద్ద జెండాలను ఆవిష్కరించారు. మంగళగిరి నుంచి విజయవాడ కాశేశ్వరరావు మార్కెట్ వరకు 100 ఆటోలతో ర్యాలీగా బయలుదేరి మార్కెట్ స్టాండ్ వద్ద జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఎస్‌కే రాష్ట్ర కార్యదర్శి బి.కొండారెడ్డి, జాన్ సైదా, ఖాసిం, బాలు, వరం, శ్రీను, కృష్ణ పాల్గొన్నారు.



నులకపేటలో జెండాను ఆవిష్కరించిన సీపీఐ నాయకులు, ఆటో డ్రైవర్స్, ఓనర్స్ నాయకులు



మంగళగిరిలో ఎర్రజెండా ఎగురవేస్తున్న దృశ్యం



తుళ్లూరు మండలంలో ఎర్ర జెండాకు వందనం చేస్తున్న వామపక్షాల నాయకులు

సీపీఎం ఆధ్వర్యంలో..

తాడేపల్లి పట్టణ రూరల్ పరిధిలో సీపీఎం ఆధ్వర్యంలో మే డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా కార్యదర్శి పాశం రామారావు పాల్గొని పలు చోట్ల జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి పరిపాలన వల్ల కార్మికులు నష్టపోతున్నారని, విశాఖ ఉక్కు కర్మాగారాన్ని మూసివేసేందుకు ప్రయత్నిస్తున్నారని, దీనిని కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా ఎదుర్కోవాలని అన్నారు. కార్యక్రమంలో గాదె సుబ్బారెడ్డి, బర్న బాస్, ముత్యాలరావు, గంజి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో....

దుగ్గిరాలలో రైలు పేటలో పసుపు ముఠా కార్మికుల విశ్రాంతి భవనం వద్ద సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఎం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు హాజరయ్యారు. మంచికలపూడిలో మే డే సందర్భంగా పోతురాజు సెంటర్‌లో సీపీఎం జెండాను ఆవిష్కరించారు. చిలువూరు గ్రామంలో బసవ పున్నయ్య స్థూపం వద్ద కె.ప్రభాకరరావు ఆవిష్కరించగా, తుమ్మపూడిలో సుందరయ్య గ్రంథాలయ జెండాను జి.యోహాను ఎగురవేశారు. కార్యక్రమాల్లో సీఐటీయూ మండల కార్యదర్శి జి.శ్రీనివాసరావు, ముఠా మేస్త్రి జి.ప్రసాద్, నాయకులు నారాయణ, అప్పారావు, బాణావత్ శ్రీను, వై. స్టాల్, బ్రహ్మేశ్వరరావు, ఎం.సుశీల, ఎ.శేషయ్య, వి.సాంబశివరావు, బి.చిరంజీవి, అంకాలరావు, నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

తాడికొండ నియోజకవర్గంలో.

తాడికొండ: తాడికొండ, తుళ్లూరు మండలాల్లో మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. తాడికొండలో సీఐటీయూ, సీపీఎం, సీపీఐ, ఏఐటియూసీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం, మార్కెట్ యార్డు, తాడికొండ, జొన్నలగడ్డ అడ్డరోడ్డు ఆటో వర్కర్స్ యూనియన్, పొన్నెకల్లు సీపీఐ కార్యాలయం, పంచాయతీ కార్యాలయం, గరికపాడు గ్రామాలలో ఎర్రజెండాను ఎగరేసిన పలువురు నాయకులు కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ళ శివ శంకరరావు, ఏఐటీయూసీ రాజధాని ప్రాంత కార్యదర్శి జీవీ రాజు, కార్మిక సంఘం నాయకులు నాగుల్ మీరా, రామినేని రామారావు, కోట రత్నకుమారి, కె.సుజాత, చింతల భాస్కరరావు, పాలడుగు మోజెస్, వెంకటేశ్వరరావు, నూతక్కి రామయ్య, మాబుదా,దాసు, కలవకొలను సాంబయ్య, జాల మరియదాసు, బండి సాంబయ్య పాల్గొన్నారు.

తుళ్లూరు మండలంలో.....

తుళ్లూరు మండలం మందడం గ్రామంలో ఏపీ సచివాలయం దారిలో ఉన్న ఎర్ర జెండాను సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి ఆవిష్కరించారు. తుళ్ళూరులో సీపీఎం కార్యదర్శి పేరం బాబూరావు, మందడంలో సీపీఎం జెండాను కార్యదర్శి గడ్డం కృష్ణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు వల్లభాపురం వెంకటేశ్వరరావు, డివిజన్ నాఆయకులు కుంభా ఆంజనేయులు, జొన్నకూటి నవీన్ ప్రకాష్, షేక్ జానీ, జీ చెంచయ్య, గుంజ ఆంజనేయులు పాల్గొన్నారు.

వడ్డేశ్వరంలో..

తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరం గ్రామంలో మేడే సందర్భంగా సీఐటీయూ జెండాను సీపీఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, సీఐటీయు నాయకులు ఎస్.కె.రహంతూ, వడ్డేశ్వరం పున్నయ్య, ఎస్‌కే గస్, పాపా సాహెబ్, చిట్టి బాబు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు బొడ్డు శంకరరావు, శ్రీనివాసరావు, హరీష్ పాల్గొన్నారు.

వేకువజామునుంచే పెన్షన్ల పంపిణీ



ఎన్ఆర్ఐలో చికిత్స పొందుతున్న దామర్ల లక్ష్మికి పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ దివ్య



వృద్ధురాలికి పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ ఉష



పెన్షన్ అందజేస్తున్న వలంటీర్

మంగళగిరి: నగరంలో సోమవారం తెల్లవారుజామునుంచే పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. మూడో వార్డులో అనారోగ్యానికి గురై చినకాకాని ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దామర్ల లక్ష్మికి వలంటీర్ దివ్య ఆస్పత్రికి వెళ్లి పెన్షన్ అందజేసింది. మంగళగిరి, తాడేపల్లిలో 12,792 పెన్షన్లుండగా 10,788 మందికి పెన్షన్లు పంపిణీ చేశారు.

పునరుత్పాదక విద్యుత్‌కు పరిష్కారం చూపిన కేఎల్‌యూ

తాడేపల్లి రూరల్: నగర పరిధిలోని వడ్డేశ్వరం, కేఎల్ విశ్వవిద్యాలయంలో పునరుత్పాదక విద్యుత్‌కు పరిష్కారం చూపిన విద్యార్థులను యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ సోమవారం అభినందించారు. ఆయన మాట్లాడుతూ గత నెల 28వ తేదీన చెన్నైలో నిర్వహించిన ఐడియాథాన్‌లో కంప్యూటర్ సైన్స్ హానర్స్ (నాలుగో సంవత్సరం) చదువుతున్న కె.లక్ష్మి, లిఖిత, జి. నాగమనీష, ట్రిపుల్ ఈ విభాగానికి చెందిన ఎ.నాగసురేష్, బి.నవీన్, ఎ. పవన్ కుమార్, ఎస్.పృథ్వీ పాల్గొని విద్యుత్‌ను పునరుత్పత్తి చేయడంపై వారు చేసిన పరిశోధనా పత్రాలను ప్రదర్శించి రెండో రన్నర్‌గా బహుమతి గెలుచుకున్నారని అన్నారు. ఎల్ అండ్ టీ సంస్థ ఈ విద్యార్థులకు యాభైవేల రూపాయలు నగదును బహుమతిగా అందజేయడంతో పాటు ఆ సంస్థలో పనిచేసేందుకు ఇంటర్న్‌షిప్ అవకాశాన్ని కల్పించారని వివరించారు. వీరికి డాక్టర్ ప్రశాంత్ శుక్లా మెంటార్‌గా వ్యవహరించారని తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ తదితరులు

కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, అకడమిక్ డీన్ హరికిరణ్ వేగే, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.కె.రామకృష్ణ, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ సింథెల్ అతిథన్, ట్రిపుల్ ఈ విభాగాధిపతి పాండియన్ విద్యార్థులను అభినందించారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

తాడేపల్లిరూరల్: అకాల వర్షాలకు తడిసిన పంటలకు రైతులకు నష్ట పరిహారం అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు కోరారు. ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లి గ్రామ పరిధిలోని తడిసిన పసుపు కల్లాలను రైతు సంఘం నాయకులతో కలసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ గత డిసెంబర్ నెలలో కురిసిన అకాల వర్షాలకు వివిధ పంటలతో పాటు పసుపు పంట కూడా దెబ్బతిందని అన్నారు. సరైన ధర లేక పసుపు వేసిన రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోయారని అన్నారు. అకాల వర్షాలకు తడిసి రంగు మారిందనే నెపంతో వెయ్యి రూపాయలు కోత విధించి, రైతుల వద్ద నుండి వ్యాపారస్తులు కొనుగోలు చేస్తున్నారని అన్నారు. తక్షణమే పసుపు క్వింటా మద్దతు ధర పదివేల రూపాయలకు కొనుగోలు చేయాలని కోరారు.



పసుపు కల్లాలను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం తాడేపల్లి మండల అధ్యక్షుడు మోదుగుల శ్రీనివాసరెడ్డి, కాట్రగడ్డ శివన్నారాయణ, రైతులు దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మేకా శ్రావణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ఆలయ ఆస్తుల పరిరక్షణకు కృషి

- ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు
- రూ.1. 56 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మంగళగిరి: ఆలయాల ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడడంతో పాటు ఆస్తులను రక్షించి వచ్చే ఆదాయంతో ఆలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) తెలిపారు. నగరంలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి చెందిన భూమిలో రూ.1.56 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి శంకుస్థాపన చేశారు. శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. నగర పరిధిలోని రాజీవ్ గృహ కల్ప రోడ్డులోని కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న స్థలంతో రూ.60 లక్షలతో దుకాణ సముదాయం నిర్మాణం, అక్కడే ఖాళీగా ఉన్న 3.30 సెంట్లలో గ్రావెల్‌తో చదును రూ.36లక్షలతో , రూ.60లక్షలతో చేపట్టిన ప్రహరీ నిర్మాణాలకు శంకుస్థాపన నిర్వహించారు. శంకుస్థాపన అనంతరం ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ హనుమంతరావు మాట్లాడుతూ ఆలయానికి చెందిన భూమికి ఇరువైపులా ఒక వైపు రాజీవ్ గృహకల్ప కాలనీ, మరో వైపు టిడ్కో నివాసాలు, మన్నెం వారి బజారు నుంచి టిప్పర్ల బజార్ వరకు రూ.60లక్షలతో రాజీవ్ గృహ కల్పరోడ్డులో దుకాణ సముదాయం నిర్మించడం జరుగుతుందన్నారు. అదే విధంగా కోట్ల రూపాయల విలువైన స్థలం అన్యాక్రాంతం కాకుండా స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణం చేసి గ్రావెల్‌తో చదును చేసి స్థలంలో మామిడి, ఉసిరి చెట్లను పెంచి ఉద్యానవనంలా అభివృద్ధి పరచేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, ఆలూరి కొండయ్య చౌదరి, వడ్లమూడి వెంకయ్య చౌదరి, పార్టీ నాయకులు ఎండి ఫిరోజ్, ఆలయ ఈవో ఏ రామకోటిరెడ్డి, దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యులు వనమా గీతాదేవి, అన్నపురెడ్డి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు

మురుగునీటి మళ్లింపు పరిశీలన

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలో జాతీయ రహదారులకు ఇరువైపులా మురుగునీటి పారుదల సమస్య తీవ్రంగా ఉంది. ఆ మురుగునీటిని మళ్లించేందుకు మార్గాలను డి.ఇ. కృష్ణారెడ్డి సోమవారం పరిశీలించారు. జాతీయ రహదారి వెంబడి సర్వీస్ రోడ్ మధ్య ఉన్న డ్రైనేజీలు గతంలో హైవే అథారిటీ నిర్మాణాన్ని చేపట్టింది. వాటివల్ల మురుగునీటి పారుదల సమస్య పరిష్కారం కాలేదు. దీంతో తాడేపల్లి డి.ఇ. కృష్ణారెడ్డి తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో జాతీయ రహదారి కింద ఎక్కడెక్కడ రోడ్డు దాటించే మార్గాలు ఉన్నాయి? వాటిని ప్రధాన డ్రైన్లలో ఉన్న మురునీటిని ఎలా మళ్లించాలి అనే విషయాలను పరిశీలించారు. జాతీయ రహదారి వెంబడి ఉన్న డ్రెయిన్లు ఎత్తుపల్లాలుగా ఉండడంతో వాటిని ఒక లెవల్‌లో నిర్మించాలని, జాతీయ రహదారి అధికారులకు సూచనలు చేయాలని కార్పొరేషన్ ఎ.ఇ.లు కిషోర్, ప్రవీణ్‌లకు సూచించారు. తాడేపల్లి పట్టణ, రూరల్ ప్రాంతాల్లో పాత కాలువల్లో ఉన్న డ్రైనేజీలు కొన్నిచోట్ల ఆక్రమణలకు గురికావడంతో టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులతో కలసి పరిశీలించి పూర్తిస్థాయిలో మురుగు నీటిని ఔటర్‌కు తరలించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు డీఈ కృష్ణారెడ్డి తెలిపారు.

తుమ్మపూడి- చిలువూరు రైల్వే గేటు తాత్కాలికంగా మూసివేత

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని తుమ్మపూడి- చిలువూరు రైల్వే గేటును తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు తెనాలి రైల్వే సెక్షన్ ఇంజినీర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి 7వ తేదీ వరకు రైల్వే గేటు, మరియు ట్రాక్ మరమ్మతుల నిమిత్తం మూసివేస్తున్నామని చెప్పారు. ఆ రహదారిలో ప్రయాణించేవారు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.